www.kalamdaily.com

Follow on: Kalamtelugu

# కలం

ప్రజల గళం...

01-03-2026, ఆదివారం    పేజీలు: 4

360° SINGLE TOPIC

లేఆఫ్స్

**ఏఐ రాకతో ఉద్యోగాలు పోతున్నాయి. ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్.. ఇలా ఒక్కటేమిటి అనేక రంగాల్లో లేఆఫ్స్ జరుగుతున్నాయి. ఏఐ రంగంలోకి ఆంథ్రోపిక్ అడుగుపెట్టడంతో పెద్ద పెద్ద ఐటీ కంపెనీలే దెబ్బతింటున్నాయి. గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి ఎంఎన్‌సీలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఏఐ రంగంలో పెట్టుబడులు పెట్టడం, నాన్ కోర్ ప్రాజెక్టులను మూసివేయడం లాంటి చర్యలతో చాలా కంపెనీలు మ్యాన్‌పవర్‌ను తగ్గించుకుంటున్నాయి. 40 ఏండ్లు దాటిన ఉద్యోగులను బలవంతంగా ఇంటికి పంపిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి! బెంగళూరు, హైదరాబాద్ సహా అంతటా ఐటీ ఉద్యోగులను పింక్ స్లిప్ ఫీవర్ వెంటాడుతున్నది. ఐటీరంగ నిపుణులు మాత్రం భయపడొద్దని, స్కిల్ ఉంటే భవిష్యత్తు బాగుంటుందని భరోసా ఇస్తున్నారు.**

*లేఆఫ్స్‌పై కలం 360 డిగ్రీస్ స్పెషల్..*

తెలంగాణ బ్యూరో, కలం

# పింక్ స్లిప్ ఫీవర్



## ఐటీ ఉద్యోగుల్లో లేఆఫ్స్ భయం.. ప్రపంచవ్యాప్తంగా ఇదే పరిస్థితి

## హైదరాబాద్‌పైనా తీవ్ర ప్రభావం.. రెండు నెలల్లోనే వేలాది జాబ్స్ కట్

ఒకప్పుడు కంపెనీలు ఆర్థిక నష్టాల్లో ఉంటే 'లే ఆఫ్స్' ప్రకటించేవి. కానీ, ఇప్పుడు కంపెనీలు లాభాల్లో ఉన్నా.. వేల సంఖ్యలో ఉద్యోగులను ఇంటికి పంపుతున్నాయి. దీనికి ప్రధాన కారణం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్. ఖర్చు తగ్గించుకోవడం మాత్రమే కాదు.. కంపెనీలు తమ బిజినెస్ స్టైల్‌నూ మార్చుకుంటున్నాయి. 'హ్యూమన్ ఫస్ట్' నుంచి 'ఏఐ ఫస్ట్'కు మారిపోయాయి. ప్రపంచ వ్యాప్తంగా 'లే ఆఫ్స్' పరంపర కొనసాగుతున్నది. ఆ ప్రభావంతో ఎప్పుడు ఎవరి ఉద్యోగం పోతుందోనన్న భయం, ఎవరికి ఏ క్షణంలో మెయిల్ కు పింక్ స్లిప్ వస్తుందోనన్న ఆందోళన టెకీల్లో కనిపిస్తున్నది. ఐటీకి మారుపేరుగా ఉన్న బెంగళూరుతోపాటు హైదరాబాద్‌లోనూ ఈ ఫీవర్ నెలకొంది.

### కరోనా నుంచి లేఆఫ్స్ ఇలా

| సంవత్సరం | ఇండియా | హైదరాబాద్ |
|---|---|---|
| 2020 | 25,000 | 5,000 |
| 2021 | 8,000 | 1,500 |
| 2022 | 20,000 | 4,000 |
| 2023 | 60,000 | 15,000 |
| 2024 | 35,000 | 8,000 |
| 2025 | 20,000 | 4,000 |
| 2026 (జనవరి, ఫిబ్రవరి) | 10,000 | 2,200 |

### గ్లోబల్‌గా ఇలా

| సంవత్సరం | లేఆఫ్స్ |
|---|---|
| 2020 | 10 కోట్లు |
| 2021 | 4 కోట్లు |
| 2022 | 1.5 కోట్లు |
| 2023 | 2 కోట్లు |
| 2024 | 1.5 కోట్లు |
| 2025 | 70 లక్షలు |
| 2026 (జనవరి, ఫిబ్రవరి) | 12 లక్షలు |

### హైదరాబాద్‌లోనూ కోతలు..

**హైదరాబాద్‌లో గత 60 రోజుల్లోనే దాదాపు 2,200 వరకు ఐటీ జాబ్స్ పోయినట్లు లెక్కలు చెప్తున్నాయి. నేరుగా కంపెనీలు ఏయే నగరాల్లో ఎన్ని లేఆఫ్స్ ప్రకటించింది చెప్పకపోయినా.. 'సైలెంట్ లేఆఫ్స్' అనేది కామన్‌గా మారిపోయింది. ఐటీ వర్గాల అంచనా మేరకు.. హైదరాబాద్‌లో జనవరి, ఫిబ్రవరి నెలల్లోనే అమెజాన్‌లో 700కు పైగా ఉద్యోగులు ఇంటికి వెళ్లారు. హైదరాబాద్‌లో చిన్న, పెద్ద ఐటీ కంపెనీలు 1,500 వరకు ఉంటాయి. ఇందులో మైక్రోసాఫ్ట్, గూగుల్ , అమెజాన్, మెటా వంటి కంపెనీలు ఉన్నాయి. మొత్తంగా హైదరాబాద్‌లో దాదాపు 10 లక్షల మంది ఐటీ రంగంలో పనిచేస్తుంటారు. టెకీల జాబ్స్ పోతుండటంతో దానిపై పరోక్షంగా ఆధారపడి పనిచేసే క్యాబ్ డ్రైవర్లు మొదలు క్యాంటీన్ వర్కర్ల వరకు తీవ్రతను ఎదుర్కోవాల్సి వస్తున్నది. దేశవ్యాప్తంగా 2 నెలల్లో 10 వేల మంది టెకీలు జాబ్ కోల్పోయారు.**

## జాబ్స్ ఎందుకు పోతున్నయ్?

- **ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), ఆటోమేషన్ అనేవి లే ఆఫ్స్‌కు ప్రధాన కారణాలు. తమ ప్రొడక్టివిటీని పెంచుకునేందుకు ఏఐపై కంపెనీలు భారీగా పెట్టుబడులు పెడ్తున్నాయి. ఇలా చేయడంతో డేటా ప్రాసెసింగ్, కస్టమర్ సపోర్ట్, కోడింగ్, అడ్మినిస్ట్రేటివ్ విభాగాల్లో ఏఐ పనులను వేగంగా చేస్తున్నది. దీంతో ఆయా స్థానాల్లో ఉన్న మానవ వనరుల అవసరం తగ్గుతున్నది. కంపెనీలు తమ బడ్జెట్‌ను జీతాల నుంచి ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ బిల్డ్ చేసుకునేందుకు మళ్లిస్తున్నాయి.**
- **కరోనా సమయంలో డిజిటల్ సేవలకు డిమాండ్ పెరగడంతో అమెజాన్, గూగుల్ వంటి సంస్థలు వేల సంఖ్యలో ఉద్యోగులను తీసుకున్నాయి. ఇప్పుడు పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చాక, ఆ స్థాయిలో సిబ్బంది అవసరం లేదని కంపెనీలు గుర్తించాయి. ఈ 'ఎక్సెస్ స్టాఫ్'ని తగ్గించుకునే క్రమంలోనే ఈ లే ఆఫ్స్ జరుగుతున్నాయి.**
- **ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక వ్యవస్థలో అనిశ్చితి నెలకొన్నది. బ్యాంక్ వడ్డీ రేట్లు పెరగడంతో కంపెనీలకు పెట్టుబడులు దొరకడం కష్టమవుతున్నది. ముఖ్యంగా స్టార్టప్స్‌కు ఫండింగ్ తగ్గింది. వస్తువుల ధరలు పెరగడంతో లాభాలు తగ్గుతున్నాయి. దీంతో కంపెనీలు తమ ఆపరేటింగ్ కాస్ట్‌ను తగ్గించుకోవడానికి ఉద్యోగులను తొలగిస్తున్నాయి.**
- **తక్కువ మందితో ఎక్కువ పని చేయించాలని ఇన్వెస్టర్లు మేనేజ్‌మెంట్లపై ఒత్తిడి చేస్తున్నారు. లాభాలు పెంచుకునేందుకు కంపెనీలు లేఆఫ్స్ ప్రకటిస్తున్నాయి.**

మరిన్ని వివరాలు 2,3,4లో..


# పదేండ్లలో 24 కోట్ల లేఆఫ్స్!

*2016 నుంచి 2026 వరకు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రంగాల్లో 24 కోట్ల మంది ఉద్యోగాలు కోల్పోయారు. కరోనా కాలంలో (2020–21) అత్యధికంగా 12 కోట్ల మంది ఉద్యోగాలు పోయాయి. టూరిజం, హోటల్, తయారీ రంగాలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది.*

| కాలం | కంపెనీలు | లే ఆఫ్స్ | కారణం |
|---|---|---|---|
| 2016–19 | 5వేలు+ | 8.5 కోట్ల మంది+ | ఆర్థిక మాంద్యం |
| 2020–21 | 15వేలు+ | 12 కోట్ల మంది+ | కరోనా |
| 2022–24 | 8వేలు+ | 1.5 కోట్ల మంది+ | ఓవర్ హైరింగ్, యుద్ధాలు |
| 2025–26 | 6వేలు+ | 35లక్షల మంది+ | ఏఐ ఆటోమేషన్ |

## స్కిల్ షిఫ్ట్

- అమెజాన్, యూపీఎస్ వంటి సంస్థలు లాజిస్టిక్స్, వేర్ హౌసింగ్ రంగంలో భారీ కోతలు విధిస్తున్నాయి. యూపీఎస్ సంస్థ 2026లో 30వేల ఉద్యోగాలను తగ్గించాలని ప్లాన్ చేస్తున్నది. వేర్‌హౌస్‌లలో రోబోటిక్స్, ఆటోమేషన్ వాడకం పెరగడం, డెలివరీ నెట్‌వర్క్‌లను అప్‌గ్రేడ్ చేయడమే దీనికి కారణం.
- బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసులన్నీ డిజిటలైజ్ అవుతున్నాయి. పెద్ద బ్యాంకులు, ఫిన్ టెక్ స్టార్టప్స్‌లు లోన్ ప్రాసెసింగ్, డేటా ఎంట్రీ, బ్యాక్ ఆఫీస్ పనులను ఏఐకి అప్పగించడంతో ఈ విభాగాల్లో ఉద్యోగాల కోత కనిపిస్తున్నది.
- మ్యానుఫాక్చరింగ్, ఆటో మొబైల్ రంగాల్లో ఫోర్డ్, టెస్లా వంటి కార్ల తయారీ సంస్థలు తమ వ్యూహాలను మార్చుకుంటున్నాయి. ఇంధన కార్ల నుంచి ఈవీ వైపు మారడంతో పాత పద్ధతిలో పనిచేసే వేల మంది కార్మికులను తొలగిస్తున్నాయి.
- రిటైల్, కన్స్యూమర్ గూడ్స్ రంగంలో నెస్లే వంటి పెద్ద కంపెనీలు కూడా వేల సంఖ్యలో ఉద్యోగాలను తగ్గిస్తున్నాయి. ఆన్‌లైన్ షాపింగ్ పెరగడంతో ఫిజికల్ స్టోర్లను తగ్గించుకుంటూ నిర్వహణ ఖర్చులను సేవ్ చేస్తున్నాయి.





### ఏఐతోనూ ఉపాధి



ఏఐ అనేది కేవలం ఒక సాధనం మాత్రమే. ఇది మనుషుల సామర్థ్యాన్ని పెంచుతుంది. 'ఏఐ' వల్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయి. గతంలో ఇంటర్నెట్ వచ్చినప్పుడు కూడా ఉద్యోగాలు పోతాయని భయపడ్డారు. కానీ, అది కోట్లాది కొత్త అవకాశాలను సృష్టించింది. ఏఐ కూడా అలాగే ఉపాధిని పెంచుతుంది.

*- సత్య నాదెళ్ల,*
మైక్రోసాఫ్ట్ సీఈవో

## ఇండియాలో దెబ్బతిన్న టాప్ 5 సెక్టార్లు

- **ఎడ్‌టెక్:** బైజూస్, అన్ అకాడమీ వంటి సంస్థలు వేల సంఖ్యలో ఉద్యోగులను తొలగించాయి. ఆన్‌లైన్ లెర్నింగ్‌కు డిమాండ్ తగ్గడమే దీనికి కారణం.
- **ఐటీ సర్వీసెస్:** ఇన్ఫోసిస్, విప్రో, టీసీఎస్ వంటి దిగ్గజాలు కొత్తవారిని తీసుకోవడం తగ్గించడమే కాకుండా.. పనితీరు సరిగ్గా లేనివారిని తొలగిస్తున్నాయి.
- **ఈ కామర్స్:** ఫ్లిప్‌కార్ట్ వంటి పెద్ద సంస్థలతో పాటు లాజిస్టిక్స్ భాగస్వాములు కూడా తమ కార్యకలాపాలను పునర్వ్యవస్థీకరిస్తున్నారు.
- **ఫిన్‌టెక్:** పేటీఎం వంటి సంస్థల్లో జరిగిన మార్పులు ఉద్యోగులపై తీవ్ర ప్రభావం చూపాయి.
- **రియల్ ఎస్టేట్ టెక్:** గృహ నిర్మాణ రంగంలో వడ్డీ రేట్ల పెరుగుదలతో టెక్ ప్లాట్‌ఫామ్స్ సిబ్బందిని కంపెనీలు తగ్గిస్తున్నాయి.

## లేఆఫ్స్‌లో బెంగళూరు టాప్

- ఇండియాలో లేఆఫ్స్ ప్రభావం కేవలం కొన్ని మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, ప్రధానంగా ఐటీ, స్టార్టప్ హబ్స్‌లో ఎక్కువగా కనిపిస్తోంది. బెంగళూరు టాప్‌ప్లేస్‌లో ఉన్నది. ఐటీ, ఎడ్‌టెక్, ఈ కామర్స్ రంగాల్లోని ఉద్యోగులు జాబ్‌లు కోల్పోతున్నారు. దేశంలోని 60శాతానికి పైగా స్టార్టప్ లేఆఫ్స్ ఇక్కడే జరుగుతున్నాయి. గత రెండు నెలల్లోనే ఇక్కడ ఐటీ రంగంలో దాదాపు 5 వేల ఉద్యోగాలు పోయాయి.
- హైదరాబాద్ రెండో స్థానంలో ఉంది. ఐటీ సర్వీసెస్, ఫార్మా కంపెనీల ఉద్యోగులు ప్రభావితం అవుతున్నారు. అంతర్జాతీయ క్లయింట్ల నుంచి ఆర్డర్లు తగ్గడం, ఏఐ ఆటోమేషన్ దీనికి కారణం.
- గురుగ్రామ్, ఢిల్లీలోని ఫిన్‌టెక్, సర్వీసెస్ స్టార్టప్స్ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఫండింగ్ కొరత కారణంగా ఎన్నో చిన్న, మధ్య తరహా స్టార్టప్స్ మూతపడటమే దీనికి కారణం.
- చెన్నైలోని సాఫ్ట్‌వేర్, మాన్యుఫాక్చరింగ్ కంపెనీల్లో పని చేస్తున్న వేలాది మంది ఉద్యోగులు ఇంటిదారిపడ్తున్నారు. ఐటీ సర్వీస్ కంపెనీలు (టీసీఎస్, కాగ్నిజెంట్) బెంచ్ పీరియడ్ తగ్గించడమే దీనికి కారణం.

కలం ప్రజల గళం...
360° SINGLE TOPIC
01-03-2026, ఆదివారం



- **రియల్ ఎస్టేట్ & హౌసింగ్:** రియల్ ఎస్టేట్‌లో ఎక్కువగా ఐటీ ఉద్యోగులు పెట్టుబడులు పెడుతుంటారు. భవిష్యత్తు కోసం ఓపెన్ ప్లాట్లు కొనుగోలు చేస్తుంటారు. అలాగే సొంతింటి కలను నెరవేర్చుకునేందుకు ఫ్లాట్లు, ఇండిపెండెంట్ ఇండ్లు, విల్లాలు కొంటుంటారు. ఇప్పుడు ఐటీ రంగంలో నెలకొన్న అనిశ్చితి కారణంగా రియల్ ఎస్టేట్ అండ్ హౌసింగ్ సెక్టార్‌లో డిమాండ్ తగ్గుతున్నది. చిన్న చిన్న కంపెనీలు మూతపడి, హైదరాబాద్‌లో ఆఫీస్ స్పేస్ వేకెన్సీ పెరుగుతున్నది. ఈ సెక్టార్ లో హైదరాబాద్ లో 5లక్షల మంది పనిచేస్తున్నారు.

- **ఫైనాన్షియల్ సర్వీసెస్:** ఓపెన్ ప్లాట్లు, ఫ్లాట్లు, ఇండ్లు కొనుగోలు చేసేందుకు ఐటీ ఎంప్లాయ్స్ ఎక్కువగా హోమ్, పర్సనల్ లోన్స్ తీసుకుంటారు. ఇప్పుడు వాళ్ల ఇన్వెస్ట్‌మెంట్స్ తగ్గి, బ్యాంకుల్లో ఎక్కువగా లోన్లు తీసుకోవట్లేదు. హెల్త్, టర్మ్ ఇన్సూరెన్స్‌లతో పాటు పిల్లల భవిష్యత్తు కోసం వివిధ రకాల లైఫ్ ఇన్సూరెన్స్‌లనూ ఐటీ ఉద్యోగులు తీసుకుంటారు. ఇప్పుడు ఇవి కూడా తగ్గుతున్నాయి. ఫైనాన్షియల్ సర్వీసెస్ సెక్టార్‌లో హైదరాబాద్‌లో 2.5 లక్షల మంది ఉపాధి పొందుతుంటారు.

- **ట్రాన్స్‌పోర్ట్ & లాజిస్టిక్స్:** మేజర్ ఐటీ కంపెనీలు తమ ఉద్యోగులకు క్యాబ్ ఫెసిలిటీ కల్పిస్తాయి. చిన్న చిన్న ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలు ఈ సేవలు అందిస్తుంటాయి. ఇప్పుడు ఐటీ జాబ్స్ కట్‌తో ఈ ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలపైనా ప్రభావం పడుతున్నది. అలాగే బెంగళూరు, హైదరాబాద్ లాంటి చోట్ల సొంతంగా క్యాబ్స్ నడిపే ఎంతోమంది ఉపాధి కోల్పోయే ముప్పు ఉంది.

- **హాస్పిటాలిటీ & టూరిజం:** ఎక్కువగా సంపాదించే ఐటీ ఉద్యోగులు.. అదే స్థాయిలో ఖర్చు చేస్తుంటారు. ఎక్కువగా పబ్స్, క్లబ్స్, రెస్టారెంట్లు, హోటళ్లకు వెళ్తుంటారు. ప్రతిఏటా ఒకట్రెండు సార్లు టూర్లకు వెళ్లొస్తారు. కానీ ఇప్పుడు వీటిపై వాళ్లు చేసే ఖర్చులు తగ్గే అవకాశం ఉంది. ఫలితంగా హాస్పిటాలిటీ, టూరిజం బిజినెస్ తగ్గుతుంది. అలాగే బిజినెస్ ట్రావెల్ కూడా డౌన్ అవుతుంది.

- **రిటైల్ & కన్జ్యూమర్ గూడ్స్:** ఐటీ ఉద్యోగుల స్పెండింగ్ తగ్గితే.. రిటైల్ సెక్టార్‌పైనా ప్రభావం పడుతుంది. షాపింగ్, గ్రోసరీ, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లు తగ్గిపోతాయి.

- **ఎడ్యుకేషన్ & ట్రైనింగ్:** ఐటీ జాబ్స్‌కు డిమాండ్ లేకపోతే ఇంజనీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్లు తగ్గిపోతాయి. ఐటీ కోర్సుల కోచింగ్ ఇనిస్టిట్యూట్లకూ డిమాండ్ ఉండదు.

- **చిరువ్యాపారులు:** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్ సిటీ, రాయదుర్గం, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాలు ఐటీ, బ్యాంకింగ్, ఫైనాన్షియల్ కంపెనీలకు అడ్డా. ఈ కంపెనీల్లో లక్షలాది మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఈ కంపెనీల దగ్గర టీ స్టాల్స్, టిఫిన్, మీల్స్ సెంటర్లు, స్నాక్స్ బండ్లు పెట్టుకొని ఎంతోమంది ఉపాధి పొందుతున్నారు. ఐటీ ఉద్యోగులు తగ్గితే.. చిరు వ్యాపారుల బిజినెస్ కూడా తగ్గుతుంది.

ఐటీ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా మరిన్ని రంగాలు ఆధారపడి ఉన్నాయి. టెకీలను డ్రాప్ చేసే క్యాబ్ డ్రైవర్లు మొదలు.. కంపెనీల్లోని క్యాంటీన్లలో పనిచేసే ఉద్యోగుల

## చిరు ఉద్యోగులకూ దెబ్బ

వరకు ఈ ప్రభావం ఉంటుంది. హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల్లో ఈ అనుబంధ రంగాలపై ఆధారపడి దాదాపు 40 లక్షల మంది బతుకుతున్నారు. ఇందులో క్యాబ్ డ్రైవర్లు 60వేల మంది వరకు ఉంటారు. లేఆఫ్స్ ప్రభావం వీరిపైనా పడుతున్నది.

## డిమాండ్ ఎవరికి?

హైదరాబాద్ ఐటీ మార్కెట్ ప్రస్తుతం చాలా వేగంగా మారుతున్నది. గతంలో మాదిరి కేవలం అప్లికేషన్ డెవలప్‌మెంట్ మాత్రమే కాకుండా, ఇప్పుడు కంపెనీలు 'స్పెషలైజ్డ్ స్కిల్స్' ఉన్న వారి కోసం వెతుకుతున్నాయి. జనరేటివ్ ఏఐ అండ్ మిషన్ లెర్నింగ్‌లో కేవలం థియరీ మాత్రమే కాకుండా ఎల్ఎల్ఎం (లార్జ్ లాంగ్వేజ్ మోడల్స్), ఏఐ ఏజెంట్లను తయారు చేసే ఇంజనీర్లకు హైదరాబాద్‌లో డిమాండ్ ఉంది.

కంపెనీల డేటా భద్రత కోసం క్లౌడ్ సెక్యూరిటీ, ఎథికల్ హ్యాకింగ్ తెలిసిన వారిని హైదరాబాద్‌లోని గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు ఎక్కువగా తీసుకుంటున్నాయి. క్లౌడ్ మైగ్రేషన్, 'క్లౌడ్ నేటివ్' అప్లికేషన్ డెవలప్మెంట్ నైపుణ్యాలకు ఎప్పుడూ డిమాండ్ ఉంటుంది.

డేటా నుంచి బిజినెస్ ఇన్‌సైట్స్ తీసే డేటా ఇంజనీర్లు, అనలిస్టులకు హైదరాబాద్‌లో మంచి అవకాశాలు ఉన్నాయి. ఇప్పుడు కంపెనీలు కేవలం ఫ్రంట్ ఎండ్ లేదా బ్యాక్ ఎండ్ మాత్రమే కాకుండా, పూర్తి స్థాయి అప్లికేషన్ హ్యాండిల్ చేయగల వారిని కోరుకుంటున్నాయి.


### హైదరాబాద్ ఐటీ..
# వెరీ పిటీ!

హైదరాబాద్‌లో ప్రభుత్వ నివేదికలు, నాస్కామ్ సంస్థ డేటా ఆధారంగా 2025–26లో 10 లక్షల మంది వరకు ఐటీ/ఐటీఈఎస్ రంగాల్లో పని చేస్తున్నారు. సిటీలో 1,500 కంటే ఎక్కువ ఐటీ కంపెనీలు ఉన్నాయి. వీటిలో టీసీఎస్‌లో 70వేల మంది, ఇన్ఫోసిస్‌లో 50వేలు, విప్రోలో 30వేలు, టెక్ మహీంద్రాలో 20వేలు, మైక్రోసాఫ్ట్‌లో 20వేలు, గూగుల్‌లో 6వేలు, అమెజాన్‌లో 8వేలు, ఒరాకిల్‌లో 10వేల మంది ఉన్నారు.

- హైదరాబాద్‌లో 2016–18లో ఆటోమేషన్ వల్ల 25వేల మంది, 2020–21లో కరోనా కారణంగా 35వేల జాబ్స్ పోయాయి.
- 2023–26లో గ్లోబల్ ఎకనామిక్ కండిషన్స్, ఏఐ వల్ల సుమారు 58వేల మందికి పైగా జాబ్స్ కోల్పోయారు.
- మొత్తం పదేండ్లలో హైదరాబాద్‌లో సుమారు 1.5 లక్షల మంది ఐటీ, వివిధ ప్రధాన రంగాల్లో ఉద్యోగాలు కోల్పోయారు. 2020 నుంచి 2025 వరకు దాదాపు 50వేల మంది ఇంటికి వెళ్లిపోవాల్సి వచ్చింది.
- బెంచ్ పీరియడ్ నియంత్రణ, రీస్ట్రక్చరింగ్ పేరుతో గత ఐదేండ్లలో కాగ్నిజెంట్ కంపెనీ భారీగా లే ఆఫ్స్ ప్రకటించింది. ఆ తర్వాతి స్థానాల్లో అమెజాన్, టీసీఎస్, బైజూస్, మైక్రోసాఫ్ట్, గూగుల్, విప్రో, ఇన్ఫోసిస్ ఉన్నాయి.
- ఒకవైపు ఉద్యోగాలు పోతున్నా, హైదరాబాద్‌లో కొత్త ఉద్యోగాల సృష్టి కూడా అదే స్థాయిలో ఉంది. ముఖ్యంగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ రాకతో గత ఏడాదిలోనే 1.5 లక్షల కొత్త జాబ్స్ జెనరేట్ అయ్యాయి.

## డేటా సెంటర్లతో వచ్చే కొలువులు ఎన్ని?

హైదరాబాద్‌ను డేటా సెంటర్‌కు రాజధానిగా మార్చాలని తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఫ్యూచర్ సిటీలో ఏఐ డేటా సెంటర్ల ఏర్పాటు కోసం దిగ్గజ కంపెనీలతో చర్చలు జరుపుతున్నది. రాబోయే రెండు మూడేండ్లలో 20 వరకు డేటా సెంటర్లు ఏర్పడతాయని అధికార వర్గాలు భావిస్తున్నాయి. ఇదే జరిగితే.. ఎంత మందికి ఉపాధి లభిస్తుంది? ఐటీ కంపెనీలు నిర్దాక్షిణ్యంగా టెకీలను తొలగిస్తుండటం, ఏఐకి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తుండటంతో.. ఈ డేటా సెంటర్లతో వచ్చే కొలువులు ఎన్ని అనేది చర్చనీయాంశంగా మారింది.




## భయపడొద్దు..



*ఏఐ ప్రభావవంతమైంది. కానీ భయపడాల్సిన అవసరం లేదు. ఇది సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ల పనిని సులభతరం చేసి, వారు మరింత సృజనాత్మకమైన పనులపై దృష్టి పెట్టేలా చేస్తుంది. దీంతో టెక్ రంగంలో మరిన్ని కొలువులు వస్తాయి. పాత పద్ధతుల్లో చేసే పనులు ఏఐకి బదిలీ అవుతాయి. కానీ, ఆ ఏఐని నడిపించడానికి, నియంత్రించడానికి మనుషుల అవసరం ఇంకా పెరుగుతుంది.*

*- సుందర్ పిచాయ్, గూగుల్ సీఈవో*

కలం ప్రజల గళం...
360° SINGLE TOPIC
01-03-2026, ఆదివారం





## అమెరికాలో లేఆఫ్స్.. ఇండియాపై ఎఫెక్ట్

- అమెరికాలో జరిగే ప్రతి చిన్న ఆర్థిక మార్పు ప్రభావం నేరుగా ఇండియా ఐటీ రంగంపై పడుతుంది. ఎందుకంటే మన ఐటీ కంపెనీల ఆదాయంలో దాదాపు 60% నుండి 70% వాటా అమెరికా క్లయింట్ల నుండే వస్తుంది. అమెరికా లేఆఫ్స్ వల్ల భారత్‌లో నష్టాలు ఎక్కువే.
- అమెరికా కంపెనీలు బడ్జెట్ తగ్గించుకున్నప్పుడు, అవి కొత్త సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్ ప్రాజెక్టులను ఆపేస్తాయి. దీంతో ఇండియాలోని టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో వంటి కంపెనీలకు వచ్చే ఆదాయం తగ్గి, నియామకాలు నిలిచిపోతాయి.
- క్లయింట్లు ప్రాజెక్టులను రద్దు చేసినప్పుడు, ఆ ప్రాజెక్టులో పని చేసే ఉద్యోగులు 'బెంచ్' మీదకు వస్తారు. కంపెనీలు ఎక్కువ కాలం వీరిని ఉంచుకోరు. ఖర్చు తగ్గించుకోవడానికి ఇండియాలో కూడా లేఆఫ్స్ ప్రకటిస్తాయి.
- అమెరికాలో అనిశ్చితి ఉన్నప్పుడు, ఇండియా ఐటీ కంపెనీలు ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ డ్రైవ్స్ నిర్వహించవు. 2024–25లో చాలా కంపెనీలు క్యాంపస్ డ్రైవ్స్‌కు దూరంగా ఉండటానికి ఇదే ప్రధాన కారణం.
- గ్లోబల్ మార్కెట్ బాలేనప్పుడు, కంపెనీలు తమ మార్జిన్లను కాపాడుకోవడానికి ఉద్యోగుల ఇయర్లీ ఇంక్రిమెంట్లను వాయిదా వేస్తాయి. లేదంటే చాలా తక్కువ శాతానికి పరిమితం చేస్తాయి. వేరియబుల్ పే కూడా భారీగా తగ్గుతుంది.
- అమెరికాలో లేఆఫ్స్ జరుగుతున్నప్పుడు, అక్కడి ప్రభుత్వం, కంపెనీలు స్థానికులకే ప్రాధాన్యమిస్తాయి. దీంతో భారతీయ ఐటీ ఉద్యోగులకు లభించే ఆన్‌సైట్ అవకాశాలు, హెచ్1బీ వీసా స్పాన్సర్‌షిప్స్ భారీగా తగ్గుతాయి.

## అమెరికాలో మనోళ్లకు గడ్డుకాలం

అమెరికాకు రెండోసారి ప్రెసిడెంట్‌గా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి అక్కడున్న ఇండియన్స్‌కు ముఖ్యంగా తెలుగువాళ్లకు గడ్డు కాలం నడుస్తున్నది. హెచ్1 బీ వీసా నిబంధనలు కఠినతరం కావడం, టారిఫ్‌ల పేరిట పూటకో ఆంక్షలు విధిస్తుండటం వారిని కలవరపరుస్తున్నది. లేఆఫ్స్ ప్రభావం అక్కడి ఐటీ కంపెనీల్లో పనిచేసే తెలుగువాళ్లను ఇంటికి పంపుతున్నది.

- అమెరికాలో తెలంగాణ, ఏపీవాళ్లు దాదాపు 10 లక్షల మంది వరకు నివసిస్తూ ఉంటారు.
- వీరిలో 70 శాతం మంది (7 లక్షల మంది) అక్కడి ఐటీ సెక్టార్‌లో పనిచేస్తుంటారు.
- 2024 నుంచి 2025 వరకు రెండేండ్లలో గ్లోబల్ లేఆఫ్స్ కారణంగా అమెరికాలోని 20 వేల మంది తెలుగువారు ఉద్యోగాలు కోల్పోయారని అంచనా.
- హెచ్1 బీ వీసా రూల్స్ మారడంతో అక్కడ కొత్త ఉద్యోగాలు వెతుక్కోవడం గగనంలా మారింది. గ్రేస్ పీరియడ్‌లో ఉద్యోగం దొరక్క గత ఏడాది కాలంలో వేల మంది తెలుగువారు తిరిగి స్వస్థలాలకు చేరుకున్నారు.

## ఏఐతో ఈ జాబ్స్‌కే ఎక్కువ ముప్పు!


1. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్స్/కోడర్స్
2. సాఫ్ట్‌వేర్ టెస్టర్స్/క్వాలిటీ అష్యూరెన్స్ అనలిస్ట్స్
3. డేటా అనలిస్ట్స్/ఎంట్రీ లెవల్ అనలిటిక్స్
4. ఐటీ సపోర్ట్/హెల్ప్ డెస్క్
5. ప్రాజెక్ట్ మేనేజర్స్ (జూనియర్ లెవల్)
6. అడ్మినిస్ట్రేటివ్/ఆఫీస్ సపోర్ట్ రోల్స్




## ఇంకా పోయేవెన్ని?

ఐటీ కంపెనీలు 2026–27 ఆర్థిక సంవత్సరంలోనూ భారీగా లేఆఫ్స్ ప్రకటించే అవకాశం ఉంది. పలు కంపెనీలు తమ క్వార్టర్ రిజల్ట్స్‌లో వీటిపై అంచనాలు కూడా వేశాయి. రీస్ట్రక్చరింగ్ పేరిట కంపెనీలు సైలెంట్ లేఆఫ్స్‌కు దిగుతున్నాయి. 40 ఏండ్లు పైబడినవాళ్లను 'ఇక మీ సేవలు చాలు' అంటూ వెనక్కి పంపిస్తున్నాయి. గ్లోబల్‌గా చూసుకుంటే 2026–27లో 2.5 లక్షల వరకు ఉద్యోగులను తొలగించవచ్చని అంతర్జాతీయ ఐటీ రంగ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇండియాలో ఈ సంఖ్య 50వేల వరకు ఉండొచ్చని భావిస్తున్నారు. ఏఐ ద్వారా తక్కువ మందితో ఎక్కువ పనిచేయించుకోవాలన్న ఉద్దేశంతోనే ఇదంతా నడుస్తున్నదని చెప్తున్నారు.

## ఇవి నేర్చుకుంటే ఉద్యోగ భద్రత



- చాట్ జీపీటీ, క్లౌడ్, గిట్ హబ్ కో పైలెట్ వంటి టూల్స్‌ను కోడింగ్, డాక్యుమెంటేషన్ కోసం ఎలా వాడాలనేది తెలుసుకోవాలి.
- కంపెనీలన్నీ తమ డేటాను క్లౌడ్‌లోకి మారుస్తున్నాయి. దీని కోసం సర్వర్‌లెస్ ఆర్కిటెక్చర్, మైక్రో సర్వీసెస్, కంటైనరైజేషన్ నేర్చుకోవాలి.
- మెషిన్ లెర్నింగ్ మోడల్స్ తయారు చేయడం ఒకెత్తయితే.. వాటిని క్లౌడ్‌లో లైవ్ చేయడం మరొకెత్తు. దీని కోసం మెషిన్ లెర్నింగ్ మోడల్స్ లైఫ్ సైకిల్‌ను ఆటోమేట్ చేయడం రావాలి. డేటా సైంటిస్టులకు, సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లకు మధ్య వంతెనలా పనిచేసే ఈ రోల్స్‌కి భారీ డిమాండ్ ఉంది.
- డేటాను శుద్ధి చేసి ఏఐకి అందించే నిపుణుల అవసరం అన్ని రంగాల్లో ఉంది. దీని కోసం బిగ్ డేటా టూల్స్ (స్నోఫ్లేక్, డేటా బ్రిక్స్), ఈటీఎల్ ప్రాసెస్, ఎస్‌క్యూఎల్‌పై పట్టు ఉన్నవారికి భారీ ప్యాకేజీ ఉంటుంది.
- ఏఐ వల్ల సైబర్ దాడులు కూడా పెరుగుతున్నాయి. వాటిని అడ్డుకోవడానికి ఏఐ తెలిసిన సెక్యూరిటీ నిపుణులు కావాలి. దీని కోసం ఏఐ ఆధారిత థ్రెట్ డిటెక్షన్, క్లౌడ్ సెక్యూరిటీ ప్రొటోకాల్స్ నేర్చుకోవాలి. సెక్యూరిటీ విభాగంలో లేఆఫ్స్ సంఖ్య మిగతా విభాగాల కంటే చాలా తక్కువగా ఉంటుంది.
- ఈ స్కిల్స్‌తో పాటు 'క్రిటికల్ థింకింగ్'.. 'ప్రాబ్లమ్ సాల్వింగ్' అనేవి చాలా ముఖ్యం.




## కొత్తగా వచ్చే జాబ్స్ ఎన్ని.. ఏవి?

నాస్కామ్ అంచనా ప్రకారం 2026–27లో ఇండియా ఐటీ రంగం 6.1శాతం వృద్ధి చెందనుంది. 315 బిలియన్ డాలర్ల రెవెన్యూ జెనరేట్ కానుంది. ప్రస్తుతం లేఆఫ్స్ ఉన్నప్పటికీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో 1.35 లక్షల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయట. పాత టెక్నాలజీ జాబ్స్ పోయి.. వాటి స్థానంలో కొత్తగా ఏఐ టెక్నాలజీ రిలేటెడ్‌గా జాబ్స్ క్రియేట్ అవుతాయి. ఇదే గ్లోబల్ గా చూసుకుంటే 1.2 కోట్ల కొలువులు వస్తాయని అంచనా. అంటే.. ఏఐ సంబంధిత స్కిల్స్ నేర్చుకున్నవాళ్లకు మంచి అవకాశాలు ఉంటాయని, కంగారు పడాల్సిన అవసరం లేదని దిగ్గజ ఐటీ కంపెనీల సీఈవోలు సైతం చెప్తున్నారు.

## 40 ఏండ్లకే రిటైర్మెంట్!

- ఐటీ, కార్పొరేట్ రంగాల్లో 40 ఏండ్లు పైబడినోళ్లను ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నారు. దీన్ని 'మిడ్ కెరీర్ క్రైసిస్' అని పిలుస్తున్నారు. 40 ఏండ్ల వాళ్లకు 15–20 ఏండ్ల అనుభవం ఉంటుంది. వీరి జీతాలూ ఎక్కువే. ఖర్చులు తగ్గించుకోవడం, ఒక సీనియర్ స్థానంలో ఇద్దరు/ ముగ్గురు జూనియర్లను తీసుకోవడం లాంటి చర్యలను కంపెనీలు చేపడ్తున్నాయి. కొత్త టెక్నాలజీలకు అనుగుణంగా సీనియర్లు అప్‌గ్రేడ్ కావట్లేదని చెప్తున్నాయి.



- ప్రపంచ వ్యాప్తంగా టెక్ రంగంలో పదేండ్లలో సుమారు 15 లక్షల మంది ఉద్యోగాలు కోల్పోయారు.
- 2023–24లోనే సుమారు 2 లక్షల మందిని ఆయా కంపెనీలు ఇంటికి పంపేశాయి. అమెజాన్, గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు 'రీస్ట్రక్చరింగ్' పేరుతో మిడ్ లెవల్ మేనేజర్లను భారీగా తొలగించాయి.
- ఇండియాలో గత పదేండ్లలో 40 ఏండ్లు దాటిన ఉద్యోగులు సుమారు 4 లక్షల మంది జాబ్స్ కోల్పోయారు. సీనియర్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, మేనేజర్లను కంపెనీలు తొలగించాయి.